# 31. దండి ఆదిగల్ నాయనారు

చోళదేశములో తిరువావూరులో దండిఆదిగళ్ అనే శివభక్తుడుండేవాడు. అతను పుట్టుగ్రుడ్డి. అయినను పంచాక్షరిని జపించాడు. పరమశివుని అంతర్ దృష్టిలో చూచేవాడు. ప్రతిరోజు శివాలయానికి వెళ్లి స్వామిని వినుతించుచు క్రింద బడుచు లేచాడు. వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఆ దేవాలయమునకు పడమటి దెసను ఒక తటాకముంది. ఆడిగళ్ దానిని పెద్దది చేయ నిశ్చయించాడు. గ్రుడ్డి వాడు ఎట్లు చేయగలడు. కాని ఎన్ని అవధులు వచ్చినను పెద్ద తటాకముగ చేయ నిశ్చయించాడు. చెరువు మధ్యలో ఒక కర్రను పాతాడు. దానికి ఒకతాడు కట్టాడు. రెండవ చివరను ఒడ్డున వున్న ఇంకొక స్తంభానికి దానిని కట్టాడు. ఆ త్రాడు పుచ్చు కొని చెరువులో దిగేవాడు. త్రవ్వడము మొదలు పెట్టేవాడు. త్రవ్వి ఆ మన్నును గంపలో పెట్టు కొని త్రాడు సాయమున తీరమునకు వచ్చి ఆ గంప మట్టిని బయట పోసేవాడు.

అక్కడనున్న జైనులు గ్రుడ్డివాడా నీకు ప్రాణములపై ఆశ లేదా, ప్రాణాపాయ కరమైన పనిని ఎందుకు చేస్తున్నావు మానేయి అని మందలించారు. "ఇది పరమేశ్వ రునికి ప్రీతిని గలిగించు కార్యము. నేను ఎట్టు మానేది?' అని సమాధానము చెప్పే వాడు. జైనులు వీనికి కన్నులు లేనట్లే చెవులు గూడ లేవు. ఎవరు చెప్పిన వినడు అనే వారు. నాకు కన్నులున్నవి చెవులున్నవి మీకే లేవు అని నాయనారు పలికాడు. 'నీకు కనుక కన్నులుండుటయే నిజమైన, మేము ఈ వూరిలో వుండము' అని జైనులు పలికారు.

ఆ రాత్రి ఆడిగాళ్‌కు స్వప్నమున పరమేశ్వరుడు సాక్షాత్కరించి 'నీకు కనులు ఇచ్చుచున్నాను, జైనులను అంధులనుగా జేసితిని' అని చెప్పాడు. రాజునకు గూడ కనబడి - జైనులు నాయనారుకు అడ్డము తగులకుండ చూడవలసినది' అని ఆదే

శించారు. మరునాడు రాజు నాయనారు వద్దకు వచ్చి 'ఏమికావాలి' అని అడిగాడు. నాయనారు రాజును చెరువు వద్దకు తీసికొని వెళ్లి జైనులను అక్కడికి రప్పించాడు. జైనులు అందరు అంధులై యున్నారు. రాజాజ్ఞ ప్రకారం వారు పడుచు లేచుచు ఎట్లో వచ్చారు. 'నాకు కన్నులు వచ్చినవి' మీరు పలికిన శపధము ప్రకారము ఈ వూరు విడిచిపెట్టి వెళ్లుడు అని నాయనారు వారినాదేశించాడు. జైనులలో కొంత మంది అందత్వముతో బాధపడలేక నాయనారును శరణుజొచ్చారు. వారు శైవు లయిన వెంటనే వారి అంధత్వము తొలగినది.

దండి ఆదిగాళ్ జీవించి యున్నంతకాలము శివపూజ, శివభక్తులకు సేవను చేస్తూ అంత్యమున శివసాయుజ్యము నొందినాడు.